



# మీలో ఒక్కడే లక్షాధికారి

ప్రతాప వెంకట సుబ్బారాయుడు (సికింద్రాబాద్)

"మీలో ఒక్కడే లక్షాధికారి కార్యక్రమానికి స్వాగతం..సుస్వాగతం! నేను మీ అప్పల్రాజు..ముందుగా 'ఏ వేలు ముందు'కి ప్రశ్నలు-

మొదటి ప్రశ్న: చేప ఎక్కడుంటుంది?

ఎ.నిప్పులో బి.రాతిలో సి.ఇంట్లో డి.నీటిలో

రెండవ ప్రశ్న: చీకటి తర్వాత వచ్చేది?

ఎ.అంటీ బి.కరెంటు బిల్లు సి.మెరుపు డి.వెలుగు

మూడవ ప్రశ్న: ఈ పదాల్ని సరైన క్రమంలో అమర్చండి-

ఎ.నీ బి.దగ్గర సి.ఉడకవు డి.పప్పులు

'ఏ వేలుముందో'లోని అన్ని ప్రశ్నలకీ తక్కువ సమయంలో ఆన్సర్ చేసి హాట్ సీటులో కూర్చోబోతున్నది వెంగళ్రావు ఫ్రం చవటపాలెం.

హాట్ సీటులో వెంగళ్రావ్‌ని కూర్చోబెట్టాక-

"ముందుగా మీ గురించి మా టీం సెల్ ఫోన్‌తో ఓ షార్ట్ ఫిల్మ్ తీశారు. చూద్దామా మరి"

"వెంగళ్రావుగారూ! ఫిల్మ్‌లో ఒకచోట మీరు కర్చీఫ్‌ని పిండుతూ, బక్కెట్‌ని నింపుతున్నారు, ఏవిటది?"

"నా చిన్నప్పటినుండీ ఎన్నో కష్టాలు పడ్డానండీ. నా శరీరం నుండీ రెండే వెలువడుతాయి. ఒకటి కన్నీళ్ళు, రెండోది చెమట. ఆ రెంటితో బకెట్ నింపి, గిన్నీస్ రికార్డ్ సాధిద్దామని నా కోరిక"

"మీ కోరిక తీరాలని నా కోరిక. అన్నట్టు మీరు లక్ష గెలుచుకుంటే ఏం చేస్తారు?"

"ఊరూరా మీ అభిమాన సంఘాలు స్థాపించి, భజనలు ఏర్పాటు చేస్తాను"

"ఓహ్! గ్రేట్. మరి గేమ్ ప్రారంభిద్దామా? ఆట షరతులు మళ్ళీ చెప్పి మీ టైం వేస్ట్ చేయను. మీకు మూడు లైఫ్ లైన్లు వుంటాయి. ఎప్పుడైనా వాటినుపయోగించుకోవచ్చు.

మొదటి ప్రశ్న: చీకటి రంగు

ఎ.ఎరుపు బి.పసుపు సి.తెలుపు డి.నలుపు

పార్టిసిపెంట్ స్వగతం 'వీళ్ళెంత తెలివితక్కువ దద్దమ్మలు? ఇదో ప్రశ్నా? నేను లక్ష ఈజీగా సంపాదించేస్తా'

"ఆన్సర్ డి అండీ"

అప్పల్రాజు పార్టిసిపెంట్‌ని వెర్రివాడిని చూస్తున్నట్టు చూస్తూ "మరి లాక్ చేసేయమంటారా?"

"ఓ"

"కరెక్ట్. మీరు వంద రూపాయలు గెలుచుకున్నారు"

"రెండొందల రెండో ప్రశ్న: పెన్ను ఉపయోగం?

ఎ.పొడవడం బి.గీకడం సి.తోమడం డి.రాయడం"

పార్టిసిపెంట్ మనసులో తనకి తనే చక్కిలిగిలి పెట్టుకుని నవ్వుకుంటూ..'ఓరి బాబో ఏం ప్రశ్నలురా బాబూ..లక్షాధికారి అయిపోవడం ఖాయం. మా ఆవిడ ఎప్పటినుండో వడ్డాణం అడుగుతోంది. శాంక్షన్ చేసేయాలి'

"డి.రాయడం అండీ"

"ఫిక్స్ చేసేయనా"

"ఆలస్యం చేయకుండా ఫిక్స్ చేయండి"

"గుడ్..మీరు రెండొందలు గెల్చుకున్నారు"

అలా వెయ్యి రూపాయల దాకా ప్రయాణం సునాయాసంగా సాగిపోయింది.

"వెయ్యి రూపాయల చెక్కు మీదే...

రెండు వేల ఆరో ప్రశ్న: చేపకళ్ళు ఎలా వుంటాయి?

ఎ.చతురస్రంగా బి.దీర్ఘచతురస్రంగా సి.సిలిండర్‌లా డి.గుండ్రంగా"

ఆలోచిస్తూ.. "నేను ఆడియన్స్ పోల్ తీసుకుంటాను"

టీవీ చూసేవాళ్ళందరూ 'ఏం పార్టిసిపెంట్‌రా బాబూ వీడు. ఇంత చిన్నది కూడా తెలియదు. అదే నేనయితేనా?'

"ఓకే.. 80శాతం డి, 10శాతం ఎ, 10శాతం బి అంటున్నారండీ ఆడియన్స్"

"నేను ఆడియన్స్‌తో వెళతాను"

"ఎక్కడికీ వెళ్ళక్కర్లేదు. వాళ్ళు మిమ్మల్ని గెలిపించి ఇక్కడే కూర్చోబెట్టారు. వాళ్ళకి థాంక్స్ చెప్పండి"

"థాంక్స్"

"మూడువేల ప్రశ్న: మా తెలుగు తల్లికి మల్లెపూదండ పాట రాసిన సంవత్సరం?

ఎ. 1950 బి. 1954 సి. 1942 డి. 1957"

'ఇదేంటీ ఇలాంటి ప్రశ్నలు అడుగుతున్నారు?'

"నేను ఫోనో ఫ్రెండ్ హెల్ప్ తీసుకుంటానండీ "

"ఓ యస్"

"నేను, మీలో ఒక్కడే లక్షాధికారి కార్యక్రమం నుండీ అప్పల్రాజునండీ! మీ ఫ్రెండ్ ఇక్కడ బాగా ఆడుతూ ఒక ప్రశ్న దగ్గర చిక్కడిపోయారు. మీ హెల్ప్ కావాలట"

"ఓహ్ ష్యూర్" అని చెప్పి, మనసులో 'వీడు నన్నిరికించాడేమిటి? ఒకవేళ నా వల్ల ఓడిపోతే జీవితాంతం తిట్టుకోడానికా..దీన్ని ఎలాగైనా తప్పించుకోవాలి'

"మా తెలుగు"

"ఏంటి మా తెలుగు..తర్వాత?"

"వినరా బాబూ..మా తెలుగు"

"ఆ, మా తెలుగు.."

"టైం అప్! పాపం మీ ఫ్రెండ్ మీకు హెల్ప్ చేయలేకపోయాడు"

"ఫిఫ్టీ ఫిఫ్టీ కూడా తీసుకుంటానండీ"

"ఓకే కంప్యూటర్గారూ రెండు తప్పు ప్రశ్నలు స్క్రీన్ నుండి తొలగించండీ"

ఎ, బిలు మాయమయ్యాయి.

"సి అండీ"

"అరె ఎలా చెప్పగలిగారు?"

"ఏం చేస్తాం గెస్ చేశాను"

"మీ గెస్ మిమ్మల్ని గెలిపించింది"

"మా 'సొల్లు ప్రశ్న..మీ సెల్లు జవాబు' లో ఆడియన్స్‌కి ఒక ప్రశ్న: పులులు వుండేది?

ఎ.థియేటర్లో బి.మాల్స్‌లో సి.అడవిలో డి.ఇంట్లో

ఒక అదృష్ట విజేతకి వంద రూపాయల బహుమతి"

(టీ వీ చూస్తున్న జనం ఎవరికి వారు వాళ్ళే తెలివైన వాళ్ళయినట్టు..వెర్రెత్తినట్టు ఎస్ఎమ్ఎస్‌లు పంపించేశారు)

"ఇదిగో పది వేల ప్రశ్న. ఆన్సర్ చెప్పడానికి మీరు కావలసినంత టైం తీసుకోవచ్చు" మనసులో 'లైఫ్ లైన్స్ పోగొట్టుకుని నాకు దొరికాడు..ఇప్పుడాడుకుంటా వీడితో చెడుగుడు' అనుకుంటూ -

"కార్గిల్ యుద్ధం ఎన్ని రాత్రులు..పగలూ జరిగింది?"

ఎ. 5, 3 బి. 4, 7 సి.10, 5 డి. 3,6"

ప్రశ్న వినంగానే వెంగళ్రావు ముఖం పాలిపోయింది.

"ఆన్సర్ చెప్పడానికి మీకు కావలసినంత టైం వుందన్న విషయం మరవద్దు. ఆన్సర్ చెపితే పదివేలు మీవి. క్విట్ అయితే వేయి రూపాయిలు..ఓడిపోతే అయిదొందలు"

"అంతంత తేడానా?" తలంతా వేడెక్కిపోతోంది. ఒంటికి చెమటలు పడుతున్నాయి. క్షణాలు గడుస్తున్న కొద్దీ కళ్ళు తిరగడం, బీపీ పెరగడం ఎక్కువవుతోంది.

"నేను క్విట్ అవుతానండీ"

"గుడ్. రిస్క్ తీసుకోలేనప్పుడు క్విట్ అవడమే బెటర్. వెయ్యి రూపాయలు తీసుకుని దయచేయండి"

మళ్ళీ మరో బకరా కోసం 'ఏ వేలు ముందు'కి ప్రశ్నలు ప్రారంభమయ్యాయి.

★